పారిశ్రామిక విధానాలపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలి

నిజాంపేట్: పశ్చిమ దేశాల్లో విఫలమైన లిబరలైజేషన్, ప్రైవేటీజేషన్, గ్లోబలైజేషన్‌లను ప్రస్తుత మోదీ ప్రభుత్వం అనుసరిస్తోందని నవ తెలంగాణ సంపాదకుడు సుధాభాస్కర్ అన్నారు. ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సీపీఎం పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. హిందూ రాజ్యస్థాపన ధ్యేయంగా ఆర్ఎస్ఎస్, బీజేపీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగంలో అల్ప సంఖ్యాక మతస్తులకు రక్షణ కల్పించాలన్నారు. రామాలయం నిర్మాణం, ఆర్టికల్–370 రద్దు ఆర్ఎస్ఎస్ లక్ష్యాల్లో భాగంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. రాబోయే రోజుల్లో ఆర్థిక సరళీకరణ, పారిశ్రామిక విధానాలపై పోరాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా బాచుపల్లి మండల కార్యదర్శి వెంకటరామయ్య వ్యవహరించగా కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి లక్ష్మణ్, దుండిగల్ నాయకుడు లింగస్వామి, బాచుపల్లికి చెందిన చంద్రశేఖర్, బాలపీరు, వెంకటరాజ్యం, సత్యం, బాలామణి, బీరప్ప, అంజయ్య, శివ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గ అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా

కౌన్సిలర్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు

దుండిగల్: ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన కౌన్సిలర్‌తో పాటు మరో వ్యక్తిపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్ఐ ప్రదీప్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. డీపోచంపల్లి సర్వే నెంబరు 120లో 80 గజాల స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన గదిని గత నెల 29న రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అయితే కొద్ది గంటల వ్యవధిలో అదే ప్రాంతంలో అక్రమ నిర్మాణాన్ని చేపట్టగా సమాచారం అందుకున్న ఆర్ఐ ప్రదీప్‌రెడ్డి వెనువెంటనే చేరుకుని మరోసారి కూల్చివేతలు చేపట్టారు. ఈ విషయంలో స్థానిక కౌన్సిలర్ సాయియాదవ్, కిరణ్‌స్వామిలు రెవెన్యూ సిబ్బందికి అడ్డు తగిలారు. వారిపై ఆర్ఐ గత నెల 30న దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


ఇంద్రసింగ్‌నగర్ అధ్యక్షుడిగా భూషణమ్‌గౌడ్ విజయం



ఇంద్రసింగ్‌నగర్ అధ్యక్షుడిగా హ్యాట్రిక్ విజయం సాధించిన భూషణంగౌడ్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఇంద్రసింగ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా భూషణమ్‌గౌడ్ హ్యాట్రిక్ విజయం సాధించారు. శనివారం రాత్రి జరిగిన ఎన్నికల్లో మొత్తం 131 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా భూషణంకు 70 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి శివకృష్ణకు 61 ఓట్లు పోలయ్యాయి. దీంతో తొమ్మిది ఓట్ల తేడాతో ఆయన విజయం సాధించారు. ఎలక్షన్ కమిటీ సభ్యులుగా సంపత్, మధుబాబు, శివశంకర్, కరుణాకర్, పోలింగ్ ఏజెంట్లుగా రాజశేఖర్, రాకేష్‌లు వ్యవహరించారు. తనపై నమ్మకముంచి హ్యాట్రిక్ విజయం అందించిన ఇంద్రసింగ్ నగర్ కాలనీ ప్రజల ఆశయాలకు అనుగుణంగా స్థానికంగా అభివృద్ధి పనులు చేపడతామని భూషణమ్‌గౌడ్ పేర్కొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత



పూజలో కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ మిథిలినగర్‌లోని శ్రీ విజయదుర్గాంబిక ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం వైభవోపేతంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో హన్మంతరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలో నాయకుడు సిద్దనోల సంజీవరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధ్యాపక నియామకాలు చేపట్టకుండా, నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వ వర్సిటీలను నిర్లక్ష్యం చేసి 11 ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. 6 వేలకు పైగా ప్రభుత్వ స్కూల్స్ మూతపడ్డాయని నాడు ప్రతి పక్షనేతగా విమర్శించిన రేవంత్ రెడ్డి అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి, వీసీలను నియమించకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

ఫ్లైఓవర్ పనులు.. జాప్యమెందుకు?

పనులు ముందుకు సాగకపోవడంతో బాచుపల్లిలో నిత్య ట్రాఫిక్ జామ్



నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులు



బాచుపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ జామ్



నిజాంపేట్: బాచుపల్లి పరిసర ప్రాంతాలైన బాచుపల్లి, నిజాంపేట్, మల్లంపేట్ భౌరంపేట్, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో వందలాది కాలనీలు, హైరెజ్ అపార్ట్‌మెంట్స్, గేటెడ్ కమ్యూనిటీలు ఉండటంతో జనాభా పెరిగిపోయింది. భవిష్యత్‌లో ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని అప్పటి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత పనులను సైతం ప్రారంభించారు. అయితే నిర్మాణ సంస్థకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు సమాచారం. మియాపూర్ – మేడ్చల్ రహదారిపై బాచుపల్లి వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు ముందుకు సాగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనుల్లో జాప్యం జరగడంతో గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. అదే విధంగా బాచుపల్లి నుంచి మల్లంపేట్ వరకు 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు కూడా ప్రారంభించారు. కాని పూర్తి స్థాయిలో పనులు మాత్రం జరగడం లేదు.

విద్యాసంస్థలు ఎక్కువ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు

బాచుపల్లి, భౌరంపేట్, దుండిగల్ మేడ్చల్ మైసమ్మగూడ ప్రాంతాలు ఎడ్యుకేషన్ హబ్‌గా మారడంతో అంతర్జాతీయ ప్రామాణాలతో కూడి పాఠశాలతో పాటు ఇంజినీరింగ్ కాలేజీలు విపరీతంగా ఈ ప్రాంతంలో ఏర్పడ్డాయి. దీంతో వేలాది మంది విద్యార్థులు ఇక్కడి విద్యాసంస్థల్లో చేరుతున్నారు. పిల్లల చదువుల కోసం కుటుంబాలు ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. అంతే కాంకుడా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ ప్రాంతంలో చదువుకునేందుకు విద్యార్థులు ఇక్కడికి ప్రతి నిత్యం రాకపోకాలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రత రోజు రోజుకు పెరుగుతూ వస్తుంది. ఇలాంటి పరిస్తుతులను అధిగమించేందుకు గత ఏడాది చేపట్టిన ఫ్లైఓవర్ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ఈ సమస్య తీవ్రత మరింత పెరిగింది.

ప్రతి రోజు ట్రాఫిక్ కష్టాలు...

ప్రతి రోజు ఉదయం సాయంత్రం వేళ్లాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజాంపేట్ నుంచి బాచుపల్లి చౌరస్తా దాటలంటే వాహనదారులకు నరకమే కనీసం 30 నిమిషాలు బాచుపల్లి సిగ్నల్ దాటాలంటే సమయం పడుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

సుమారు కిలో మీటర్ పైనే ట్రాఫిక్ జామ్

బాచుపల్లి చౌరస్తాలో ఇటు మియపూర్, ప్రగతినగర్ పైపు అటు మల్లంపేట్, నిజాంపేట్ పైపు ఒక్కడ చూసిన సుమారు కిలో మీటర్ పైనే ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక అటు జేఎస్‌టీయూ నుంచి ప్రగతినగర్ మీదుగా వచ్చే వహనాలు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడుతున్నారు. ఈ ట్రాఫిక్ సమస్యను పరిష్కారించేందుకు పూర్తిస్థాయిలో ట్రాఫిక్ పోలీసులు సైతం లేకపోవడంతో మరి కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

శాఖల మధ్య సమన్వయ లోపం....

ఫ్లైఓవర్ పనులు, మల్లంపేట్ రోడ్డు విస్తరణ పనులు హెచ్ఎండీఏ నిధులతో చేపడుతుండటంతో ఇటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కాని అటు దుండిగల్ మున్సిపల్ అధికారులు కాని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులపై కనీస పర్యవేక్షణ లేకపోవడంతో చిన్న చిన్న సమస్యలు సైతం ప్రజలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. అటు మున్సిపల్ అధికారులకు సమస్య చెబితే అది హెచ్ఎండీఏ అధికారుల పరిధిలో ఉందంటూ చేతులెత్తయడం పట్ల వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఎండీఏ అధికారుల వివరాలు స్థానికులకు కాని వాహనదారులకు వద్ద కాని ఉండని పరిస్థితి.

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి...



బాచుపల్లి ఫ్లైఓవర్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి. గత సంవత్సరం ప్రారంభించిన పనులను పూర్తి చేయడంలో హెచ్ఎండీఏ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. అత్యంత ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతంలో పనులను వేగంగా పూర్తి చేయాల్సింది ఉంది.ఫ్లైఓవరు పనుల మూలంగా ప్రతి రోజు వాహనదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.ఇప్పటికైన సమస్య ఏదైన ముందు పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– కాసాని వీరేశ్, బీఆర్ఎస్ నాయకుడు

వెంటనే నిధులు విడుదల చేయాలి..

పనులు ప్రారంభించి సంవత్సరం అవుతున్నా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పిల్లర్లు పూర్తి కాలేదు. బాచుపల్లి చౌరస్తాలో ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య దారుణమైన పరిస్థితిలో ఉంది. ఇప్పటికైనా హెచ్ఎండీఏ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అవసరమైన నిధులు విడుదల చేసి తక్షణమే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుని ప్రజల ఇబ్బందులను తీర్చాలి.

– ఆకుల సతీష్,బీజేపీ అధ్యక్షుడు(ఎస్ఎంసీ)

ట్రాఫిక్ ఉల్లంఘనలను ఉపేక్షించేది లేదు

అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు



ద్విచక్ర వాహనదారులకు కౌన్సింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు

కుత్బుల్లాపూర్: రాంగ్ రూట్, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్‌లు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అల్వాల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సుచిత్ర, పేట్‌బషీరాబాద్, కొంపల్లి తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగ్‌రూట్‌లో రాకపోకలు సాగిస్తున్న వాహనాదారులకు, బైక్‌పై నెంబర్లు ప్లేట్లు లేని వాటిని, వాహనాలకు సంబంధించి డాక్యుమెంట్లు లేని వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. వారికి ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు కౌన్సిలింగ్ ఇచ్చి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టుబడిన వాహనదాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ ఉల్లంఘలను ఉపేక్షించేది లేదనిన్నారు. కోర్టులో చలాన్‌లు చెల్లించి వాహనాలను తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

ముఖ్యమంత్రిని కలిసిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న 8630 మంది భాషా పండితులకు పదోన్నతులు కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపామన్నారు. అనంతరం అడ్వకసి బ్యాక్‌లాగ్ కారణంగా పదోన్నతులు రానటువంటి భాషా పండితులకు భవిష్యత్‌లో గ్రేడ్–2 భాషా పండితులుగా నియామకమయ్యే వారు ఎవరూ లేనందున బ్యాక్‌లాగ్ పోస్టులను సాధారణ పోస్టులుగా మార్చి పదోన్నతులు కల్పించాలని కోరామన్నారు. అదే విధంగా అప్‌గ్రేడ్ కాని మిగిలిన 1000 గ్రేడ్ 2 భాషా పండిత పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పండిత వ్యవస్థను పూర్తి స్థాయిలో రద్దు చేయాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడె మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల,కాంతికృష్ణ, కోశాధికారి వీఎస్ఎస్‌సీ శర్మ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు హమీద్ ఖాన్ బృందం ఉన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి

సుభాష్‌నగర్: ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలకు వ్యతిరేకంగా పోరాడిన మహోన్నత వ్యక్తి డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ అని సుభాష్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు అన్నారు. ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని సూరారం రామలీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ... కొన్ని దుష్టశక్తులు దేశాన్ని రెండుగా విభజించాలని చూస్తున్నాయని అన్నారు. దీనిని బీజేపీ అడ్డుకుని తీరుతుందన్నారు. దేశంలోని అన్ని మతాలకు ఒకే చట్టం, ఒకే రాజ్యాంగం అమలయ్యేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి విజేందర్‌రెడ్డి, కార్యదర్శి విజయ్, నాయకులు మహేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో మాజీ కేంద్ర మంత్రి, జన్ సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి జరిగింది. ఆదివారం సురేష్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా బీజేపీ కన్వీనర్ మాల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు.



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



నివాళులర్పిస్తున్న మాల్లారెడ్డి, శేఖర్‌యాదవ్

పరిగి దర్గాలో ప్రార్థనలు

కుత్బుల్లాపూర్: మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ ఆదివారం పరిగి దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా దర్గాలో చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఉచిత విద్యుత్‌పై హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరాపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలకు ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల పేద విద్యార్థులు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితమే ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ కోరినట్లు ఆయన గుర్తు చేశారు.

ప్లేగ్రౌండ్ స్థలంలో ఫిల్లింగ్ స్టేషన్ ఎలా ఏర్పాటు చేస్తారు?

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనతో ఫెన్సింగ్ పనులు నిలిపివేత

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో జలమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ స్టేషన్ కంచె పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. పాఠశాలలకు ఆనుకుని ఉన్న సదరు స్థలంలో ప్లేగ్రౌండ్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు గత కొంత కాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు ఖాళీ స్థలంలో కొంత భాగాన్ని జలమండలికి కేటాయించగా నీటి ఫిల్లింగ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ప్లేగ్రౌండ్ కోసం కేటాయించాల్సిన స్థలంలో ఫిల్లింగ్ స్టేషన్‌ను ఎలా ఏర్పాటు చేస్తారంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో తాత్కాలికంగా పనులు నిలిపివేశారు. అయితే ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో సదరు పనులను పూర్తి చేసి చుట్టూ ఫెన్సింగ్ వేసి గేటును సైతం ఏర్పాటు చేశారు. దీంతో అధికారుల తీరుపై పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుతో తమ పిల్లలు ఆడుకునే స్థలం లేకుండాపోయిందని వాపోతున్నారు.



వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ చుట్టూ కంచె ఏర్పాటు చేసి గేటు అమర్చుతున్న దృశ్యం

సెలూన్ దుకాణంలో అగ్నిప్రమాదం



షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన సెలూన్ దుకాణం

కుత్బుల్లాపూర్: షార్ట్ సర్క్యూట్‌తో ఓ సెలూన్ దుకాణం కాలిబూడిదైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్ర సర్వీసులో ఉన్న ఉప్పలాస్ ఫ్యామిలీ సెలూన్‌లోని ఆదివారం ఉదయం ఏసీని ఆన్ చేయగానే షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో సెలూన్‌లోని ఓ గది పూర్తిగా మంటలకు దగ్ధం అయ్యింది. మరో నాలుగు గదులు పాక్షికంగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. అయితే దట్టమైన పొగలు వ్యాపించడంతో భవనం రెండో అంతస్తులో ఉన్న శ్రీరామ ఇన్సూరెన్స్‌లోని పని చేస్తున్న సిబ్బంది ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో ముగ్గురు సిబ్బందిని అంబులెన్స్‌లో సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. కాగా ఈ ప్రమాదంలో రూ. 3లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని నిర్వాహకుడు పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలి

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్



షాపూర్ ఎలైట్ కౌంటీ అపార్ట్‌మెంట్స్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు స్థానిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ పరిధి టీఎస్ఐఐసీ కాలనీలోని షాపూర్ ఎలైట్ కౌంటీ అపార్ట్‌మెంట్స్ నూతన కమిటీ సభ్యులు ఆదివారం పేట్‌బషీరాబాద్‌లని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి శుభాకాంక్షాలు తెలిపి అభినందించారు. తమ ప్రాంతంలో సీసీ రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ మొహమ్మద్ సిద్దిఖ్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రావు, జనరల్ సెక్రటరీ పిల్లి శంకర్, జాయింట్ సెక్రటరీ గిరీష్ కుమార్, ట్రెజరర్ కొబ్బరి గోవిందయ్య, సభ్యులు వెంకటేష్, నాగరాజు, వీరనాల నందనార్, నుజ్జెల నాగరాజు, ఆలపాటి నరేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

◆ జీడిమెట్ల గ్రామంలోని దుర్గామాత ఆలయ వార్షికోత్సవం, బోనాల పండుగ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే వివేకానంద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కృపకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆయన కోరుకున్నారు. బౌరంపేట్ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్దిరాములు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాలే నాగేష్, బాల మల్లేష్, బేకు ఆనంద్‌బాబు, శ్రీకాంత్, విజయ్ హరీష్, కాలే గణేష్, శ్యామల, ఆలయ కమిటీ సభ్యులు శంకరయ్య, బాలరాజు, నవీన్, కుమార్, గ్రామస్తులు, భక్తులు తదితరులు ఉన్నారు.